
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5


తిరుపతి
జిల్లా వార్తలు

మంగళవారం 2 జనవరి 2024






పీఎస్ఎల్వీ-సీ 58 తొలి దశ



రెండో దశ



మూడో దశ



నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

గఘన విజయం

కొత్త ఏడాది తొలి ప్రయోగ విజయంతో షార్‌లో సంబరోత్సాహాలు



సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్ఎల్వీ 60వ ప్రయోగం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో కొత్త ఉత్సాహం నింపింది. సంవత్సరం ప్రారంభపు రోజున ఇస్రోకి లభించిన విజయంగా భావిస్తున్నారు. ఇస్రో విజయాశ్వంగా భావించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ సోమవారం ఉదయం ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో పాటూ కీలక పరిశోధనలకు ఉపయోగపడే పది పరికరాలను అంతరిక్షంలోకి చేర్చింది. ఇస్రో భవిష్యత్ ప్రయాణానికి ఈ ప్రయోగాలు చాలా ప్రాధాన్యం కలిగినవి.

సంబరాలు

ఆదివారం ఉదయం 8.10 గంటలకు మొదలైన రాకెట్ కౌంట్‌డౌన్ 25 గంటల పాటు కొనసాగింది. సోమవారం ఉదయం 9.10 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ గగనతలంలోకి పీఎస్ఎల్వీ దూసుకెళ్లింది. ఏ రకమైన తడబాటు లేకుండా నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, పరికరాలనూ ప్రవేశపెట్టడంతో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలు, ఇస్రో ఉద్యోగులు పరస్పరం అభినందించుకుంటూ కనిపించారు. హ్యాపీ న్యూ ఇయర్‌తో పాటూ కంగ్రాట్స్ అనే మాట అందరినోటా వినిపించింది.విజిటర్స్ గ్యాలరీలో ప్రయోగాన్ని చూసేందుకు వచ్చినవారి చప్పట్లతో, ఈలలతో ఆ ప్రాంతం మార్మోగింది. అంతరిక్షంలోకి పంపిన పది పరిశోధక పరికరాల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా శ్రీహరికోట నుంచి ప్రయోగాన్ని వీక్షించారు.



షార్‌లో ముంబాయికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు



గ్యాలరీలో వీక్షకుల సందడి



నాయుడుపేటలో మౌన దీక్ష



తిరుపతిలో సాష్టాంగ నమస్కారాలతో నిరసన

పాత దుస్తులతో
అంగన్వాడీల మౌన దీక్ష

తిరుపతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాది సందర్భంగా సోమవారం ప్రపంచమంతా వేడుకలు, సంబరాల్లో మునిగి తేలుతుండగా నాయుడుపేటలో అంగన్‌వాడీ సిబ్బంది మాత్రం పాత దుస్తులు ధరించి మౌన దీక్షతో తమ నిరవధిక సమ్మె కొనసాగించారు. గూడూరులో కోలాటం, కోట మండల కేంద్రంలో కబడ్డీ తదితర ఆటలాడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేయగా తిరుపతిలో సాష్టాంగ ప్రమాణాలతో ప్రభుత్వం మనసు మారాలని సిబ్బంది ప్రార్థనలు చేశారు. శ్రీకాళహస్తిలో శిబిరంలోనే కేక్ కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్న సిబ్బంది అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త ఏడాదిలోనైనా జగన్ బుద్ధి మారి తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. వెంకటగిరి, సూళ్ళూరుపేట, చంద్రగిరి, రేణిగుంటల్లో ఉద్యోగులు ధర్నాలు కొనసాగించారు. సత్యవేడులో ధర్నా చేపట్టిన అంగన్‌వాడీ సిబ్బందిని మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ ఇంచార్జి డాక్టర్ హెలెన్ పరామర్శించగా మరో నేత జేడీ రాజశేఖర్ సిబ్బందికి ఆర్థికసాయం అందించారు. పుత్తూరులో సమ్మె చేస్తున్న సిబ్బందికి టీడీపీ నేత విజయబాబు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేశారు.

అట్టహాసంగా జల్లికట్టు

జనసంద్రమైన కొత్త శానంబట్ల





చంద్రగిరి, జనవరి 1: చంద్రగిరి మండలంలో సంక్రాంతి సందడి మొదలైంది.కొత్తశానంబట్ల గ్రామంలో సోమవారం పశువుల పండుగ(జల్లికట్టు)ను వేడుకగా నిర్వహించారు. కొత్తశానంబట్లతో పాటు పరిసర గ్రామాల నుంచి పశువులను సోమవారం ఉదయం గ్రామానికి తోలుకొచ్చారు. వాటి కొమ్ములు చెలిగి, రంగులు వేసి, కొప్పులను తొడిగి, రాజకీయ నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలు, రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలతో పాటు, నగదు, బట్టలు, విలువైన వస్తు సామాగ్రిని కట్టారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో గ్రామంలోని నడివీధిలో పశువులను గుంపులు గుంపులుగా వదిలారు. అప్పటికే గ్రామానికి పరిసర గ్రామాలకు చెందిన జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు.ఉత్సాహవంతులైన యువకులు అల్లె అవతల నిలబడి పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. కోడెగిత్తల కొమ్ములకున్న చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా యువకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పశువులను నిలువరించే క్రమంలో కింద పడడంతో పదిమందికి గాయాలయ్యాయి.వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. జల్లికట్టును తిలకించడానికి వచ్చిన వారందరికీ గ్రామస్తులు భోజన, తాగునీటి సౌకర్యం కల్పించారు.

తిరుపతి గంగమ్మ గుడిలో నిధుల గోల్‌మాల్
పాపమంతా పోయినోడిదే!

లెక్కల్లేని సొమ్ము రూ.52లక్షలుగా తేలింది
చనిపోయిన ఈవో బెనిఫిట్స్ నుంచి రికవరీ
వారంలో దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక
సిబ్బందిపై ఆరోపణలపైనా విచారణ : ఆర్జేసీ

తిరుపతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జరిగిన గోల్‌మాల్‌పై శిక్ష మొత్తం చనిపోయిన ఇన్‌చార్జి ఈవో మునికృష్ణయ్య కుటుంబంపై పడనుంది.దేవదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఐదుగురు అధికారులతో చేపట్టిన విచారణ నివేదిక ఆ శాఖ ప్రాంతీయ సంయుక్త అధికారి (ఆర్జేసీ)సత్యనారాయణ మూర్తి చేతికి వచ్చింది. తుది పరిశీలన అనంతరం బాధ్యులపై చర్యలు నిమిత్తం మరో వారం రోజుల్లో ఆ శాఖ కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్టు ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. విచారణ నివేదికలో రూ.52లక్షలకు లెక్కల్లేవని గుర్తించామని....వాటిని చనిపోయిన ఈవో మునికృష్ణయ్య బెనిఫిట్స్ నుంచి రికవరీ చేయనున్నట్టు తెలిపారు. ఆలయంలో అవినీతి అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై 'గంగమ్మ గుడిలో గోల్‌మాల్' శీర్షికన డిసెంబరు 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం అటు దేవదాయ శాఖతో పాటు ఇటు నగరంలోనూ తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.ఈ క్రమంలో ఆరోపణలపై నిగ్గుతేల్చాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో దేవదాయ శాఖ ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీని నియమించింది.అయితే తప్పులన్నింటికీ చనిపోయిన ఈవోనే బాధ్యుడిని చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. మునికృష్ణయ్య చనిపోయిన తర్వాత కూడా ముందస్తుగా సంతకం పెట్టివున్న చెక్కులను ఆలయ సిబ్బంది విత్‌డ్రా చేసుకున్నట్టు తెలుస్తోంది. అదేవిధంగా నకిలీ రసీదులతో కొంతమంది సిబ్బంది భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు బలమైన ఆరోపణలున్నాయి.ఈ లెక్కలను తారుమారు చేసేందుకు దొంగ రసీదులు సృష్టించినప్పటికీ రూ.52లక్షలు మాయమైనట్టు గుర్తించారు. జనరల్ అకౌంట్‌కు సంబంధించి రూ.31లక్షలు, ఆలయ ప్రాకారానికి సంబంధించి రూ.21లక్షలు గల్లంతైనట్టు నివేదిక ద్వారా తెలియవచ్చింది. అయితే సిబ్బంది చేతివాటంపై అధికార పార్టీ పెద్దల ఒత్తిడి కారణంగానే ఉన్నతాధికారులు మౌనం దాల్చుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.నిందలన్నీ చనిపోయిన వ్యక్తిపై వేసి వారి కుటుంబాన్ని బలిపశువు చేయడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదేవిధంగా మునికృష్ణయ్య గతంలో పనిచేసిన కుందాల గోవిందరాజ స్వామి ట్రస్టు, దేశమ్మ ఆలయాలపై కూడా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వాటిపై కూడా విచారణ జరిపించాలని ఆర్జేసీ మౌఖిక ఆదేశాలిచ్చారు. గంగమ్మ ఆలయ పునః నిర్మాణంలో భాగంగా తొలగించిన స్క్రాప్‌ను విక్రయించినట్టు తన దృష్టికి రాలేదని, దానిపై కూడా విచారణ జరుపుతామని చెప్పారు. ఆలయ సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై కూడా విచారణ జరిపించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్జేసీ సత్యనారాయణ మూర్తి చెప్పారు.



మేత భూముల్లో తవ్వకాలకు బ్రేక్

హైకోర్టు ఉత్తర్వులతో సత్యవేడులో నిలిచిన మైనింగ్

సత్యవేడు, జనవరి 1: సత్యవేడు మండలంలోని మేతబీడు భూముల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలకు బ్రేక్ పడింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులకు గ్రావెల్ తవ్వకాలు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. దీంతో నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు సహా ఏడు మండలాల్లో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.అడ్డగోలుగా అనుమతులు పొంది నిత్యం వందలాది వాహనాల్లో యథేచ్ఛగా సరిహద్దు దాటించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో అసైన్డ్, డీకేటీ భూములని కాకుండా గ్రామాల్లో పశువులు, మూగ జీవాల పోషణ కోసం వదిలి పెట్టిన మేతబీడు భూముల్లో సైతం తవ్వకాలు జరుపుతూ సహజ వనరుల దోపిడీకి తెరలేపారు. కొన్ని చోట్ల స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురైనా కేసుల పేరుతో భయపెట్టి మైనింగ్ జరుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా సత్యవేడు మండలం కాదిరివేడు పంచాయతీ పరిధిలోని 93, 1/2బీ, 17/1, 17/19, 127/3, 128/1ఏ, 129, 130, 131, 132, 133, 134/1, 135/1, 136, 138, 140/2, 142/1, 249/2 సర్వే నెంబర్లలోని సుమారు వంద ఎకరాలకు పైగా మేతబీడు భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు 2021లో మైనింగ్ అధికారులు ఎన్‌ఓసీలు ఇచ్చారు. రెవెన్యూ రికార్డుల్లో మేతబీడుగా పేర్కొన్న ఆ భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పి.శివకుమార్ 2022లో హైకోర్టులో ప్రజా ప్రయోజనవ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం గ్రావెల్ అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ప్రస్తుతం మేతబీడు భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు తాత్కాలికంగా చెక్ పడింది.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె



కేక్ కట్ చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

చంద్రగిరి, జనవరి 1: చంద్రగిరిలోని బాలికోన్నత పాఠశాల ముందు అంగన్వాడీ వర్కర్లు సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని దీక్ష చేపట్టారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ స్వయంగా అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీని నెవేర్చాలన్నారు. 2024వ సంవత్సరంలోనైనా తమ డిమాండ్లు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, ప్రియ, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, పద్మిని, సుజాత, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయం కిటకిట

చంద్రగిరి, జనవరి 1: శ్రీనివాసమంగాపురంలో వెలిసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు స్వామిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి తిరుప్పావై సేవలతో మేల్కొలిపి, తోమాల సేవ, కొలువు, పంచాగ శ్రవణం నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారధి, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మూలస్థాన ఎల్లమ్మ, కోదండరామాలయం, శ్యామలాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భాకరాపేట, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవరకొండ వేంకటేశ్వరస్వామిఆలయం, రంగన్నగారిగడ్డ కొల్లాపురమ్మ ఆలయం, చిట్టేచెర్ల అభయ వేంకటేశ్వర స్వామి ఆలయం, భాకరాపేట ముత్యాలమ్మ ఆలయం, నెమలిగుండ్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ తరువాత ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు స్వామి వార్ల దర్శనం కల్పించారు. దేవరకొండ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సిద్ధేశ్వరుడి సేవలో ప్రముఖులు



ఎర్రావారి పాలెం, జనవరి 1: తలకోన సిద్ధేశ్వర స్వామిని ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ మిధున్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, తుడా చైర్మన్ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తదితరులు నూతన సంవత్సర వేడుకలను సిద్ధేశ్వర స్వామి సన్నిధిలో జరుపుకున్నారు.ఆలయ అధికారులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

14నుంచి ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాలు



చంద్రగిరి, జనవరి 1: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాల పోస్టర్లను సోమవారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 14 నుంచి 18వ తేది వరకు సంక్రాంతి ఉత్సవాలు జరగనున్నాయి. అనంతరం ఆయల చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి మోహిత్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో తిమ్మారెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు

తిరుపతి (రవాణా), జనవరి 1: తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు క్యాలెండర్‌ను సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంకు పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసుదేవయాదవ్, డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, పోలిరెడ్డి, నాగిరెడ్డి వెంకటేష్ రాయల్, రేమాల బ్రహ్మానందరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, కాసిం మహమ్మద్, చంద్ర, చింతా రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్‌రెడ్డి, జీఎం ప్రకాష్, చీఫ్ మేనేజర్లు వెంకటేష్, రవి, మేనేజరు వినోద్, సీఏ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు

పాకాల, జనవరి 1:అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఇంటర్ బోర్డ్, కామన్‌మెన్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టి.మనిషా నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. పి.మధులత జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.బేబీశ్వర రెడ్డి, అధ్యాపకులు విద్యార్థినులను అభినందించారు.

కృష్ణాపురంలో పిచ్చికుక్క వీరంగం

ఐదుగురికి గాయాలు

పాకాల, జనవరి1: మొగరాల పంచాయతీ కృష్ణాపురంలో సోమవారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. గ్రామంలో పి.చంద్రమ్మ, జయమ్మ, భాగ్యమ్మ, జ్వాలాముఖి, ఎం.మునస్వామినాయుడులను గాయపరచింది. పొలంలో పనిచేసుకుంటున్న మహిళను సైతం పిచ్చికుక్క కరవడంతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్క బారినుండి కాపాడాలని కోరుతున్నారు.





శిల్పారామంలో సంవత్సరాది వేడుకలు



తిరుచానూరు, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వేడుకలు మిన్నంటాయి. సునామీ సుధాకర్ బృందం చేసిన కామెడీ స్కిట్ నవ్వులు పూయించగా స్ప్రింగ్ స్టికర్స్ బృందం ప్రదర్శించిన డ్యాన్స్ మైమరిపించింది. నెల్లూరుకు చెందిన భూమిక బృందం, గంగాధర్ డ్యాన్స్ ట్రూప్, రోబో డ్యాన్స్ ప్రదర్శించిన, సినీ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఇక విన్నర్ సంస్థచే నిర్వహించిన ఫ్యాషన్ షోలో పలువురు అదరహో అనిపించారు. సాయంత్రం సందర్శకులతో శిల్పారామం కిక్కిరిసిపోయింది. పార్కింగ్ స్థలాలు నిండిపోవడంతో నగరవాసులు తమ వాహనాలను శిల్పారామం ఎదుట ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. ఆ రహదారిలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడ్డారు.కళాకారులకు శిల్పారామం ఏవో ఖాదరవల్లి జ్ఞాపికలు అందజేశారు.

కలినరీ ఇన్‌స్టిట్యూట్ దక్షిణ భారతావనికి వరం

ప్రతిష్ఠాత్మక సంస్థను మరింతగా అభివృద్ధి చేస్తాం ● అడ్మిషన్లు మరింతగా పెంచాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 1: తిరుపతి జిల్లాలో ఏర్పాటైన అత్యంత ప్రతిష్ఠాత్మక పాకశాస్త్ర సంస్థ దక్షిణ భారతావనికి వరం లాంటిదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభివర్ణించారు. సోమవారం ఆయన తిరుమల నుంచి తిరుపతికి చేరుకుని స్థానిక నాయకులతో కలిసి కలినరీ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలించారు. ఫ్యాకల్టీతో మాట్లాడి వివరాలు రాబట్టారు. అడ్మిషన్లు తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. అన్ని కోర్సులకు అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఇక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయని, రెండేళ్లుగా అంతకంటే ఎక్కువ ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఫ్యాకల్టీ మంత్రికి వివరించారు. సిబ్బంది కొరత కూడా ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి అకడమిక్ విషయాలు, వసతులు, ఫ్యాకల్టీ సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పాకశాస్త్ర సంస్థలు ఒకటి నోయిడాలో ఉండగా మరొకటి తిరుపతిలో ఏర్పాటైందన్నారు. దక్షిణ భారత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థకు మరిన్ని నిధులు అందించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ తిరులోగ చందన్, పర్యాటక శాఖ సౌత్‌జోన్ రీజనల్ డైరెక్టర్ వెంకటేషన్ దత్తాత్రేయన్, అలిపిరి సమీపంలోని ఎస్‌ఐహెచ్‌ఎం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణప్రసాద్, సంస్థ ఫుడ్ ప్రొడక్షన్ ఫ్యాకల్టీ, షెఫ్ విష్ణుప్రియ, ఏపీ హోటల్స్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు మునిసుబ్రహ్మణ్యం, పొన్నగంటి భాస్కర్, వరప్రసాద్ మంత్రితో ఉన్నారు.



కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ తిరులోగ చందన్‌తో కిషన్‌రెడ్డి తదితరులు

అమ్మవారి సేవలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి



తిరుచానూరు, జనవరి 1: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సోమవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. అలాగే నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని భక్తులు అమ్మవారి ఆలయానికి పోటెత్తారు. కాగా ఆలయ సన్నిధిలో ఓ వ్యక్తి మరణించడంతో సోమవారం కుంకుమార్చన, వీఐపీ బ్రేక్, కొన్ని సేవలను రద్దు చేశారు.

రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుడి మృతి

పాకాల, జనవరి 1: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట సోమవారం ఓ వృద్ధుడు మృతిచెంది వుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి జేబులోని ఆధార్ కార్డు వివరాల మేరకు చిత్తూరు బజారువీధికి చెందిన జి.వెంకట్రామానాయుడు కుమారుడు జి.రామకృష్ణయ్య (76)గా గుర్తించారు. మృతుడు తెల్లషర్టు, లుంగీ ధరించి వున్నాడు. అనారోగ్యంతో మృతి చెందాడా, ఇతర కారణాలా తెలియాల్సి వుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

రామచంద్రాపురం, జనవరి 1: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా మండలం లోని రాయలచెరువుకట్ట భవానీజలకంఠేశ్వర ఆలయం, శ్రీశక్తిపీఠం, పారకాలువ రాజ రాజేశ్వరిపీఠంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. జలకంఠేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం



తిరుపతి, జనవరి1(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు సోమవారం ఆ పార్టీ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాయి. నాయకులు, కార్యకర్తలు ఆమె ఇంటికి చేరుకుని శాలువా, చిత్రపటాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని, కొత్త సంవత్సరంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, బ్యాంకు శాంతమ్మ, బిజి కృష్ణ యాదవ్, రుద్రకోటి సదాశివం, రాజయ్య, అనిత, రామ్మూర్తి రాయల్, హేమ, కరాటే చంద్ర, సుబ్రమణ్యం, గంగులయ్య, ఎస్వీఎం శ్రీధర్, జగ్గయ్య తదితరులు ఉన్నారు.



టీడీపీ నేత పులివర్తి నానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌బాషా

వైభవంగా దుర్గాభవానీ పుష్ప రథోత్సవం



పుష్పపల్లకీలో ఊరేగుతున్న దుర్గాభవానీ అమ్మవారు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 1 : శివజ్యోతినగర్‌లో వెలసిన దుర్గాభవానీ అమ్మవారి పుష్ప రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా సాగింది. వార్షిక పడి పూజ మహోత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఆదివారం పడి పూజోత్సవం, రెండో రోజు సోమవారం ఉదయం మూలవర్లకు శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం వివిధ పుష్పాలతో అలంకరించిన ప్రభలపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. మున్సిపల్ పార్కు నుంచి లీలామహల్, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, తిలక్‌రోడ్డు మీదుగా తిరుమల బైపాస్ రోడ్డులోని ఆలయానికి వేంచేపు చేశారు. దారిపొడవునా భక్తులు అమ్మవారికి హారతులు సమర్పించారు. చివరి రోజు మంగళవారం రాత్రి మండల మాలలు ధరించిన భక్తులు ఇరుముడి, హోమం, మహాప్రదక్షిణ ఉంటాయి. ఈ ఉత్సవంలో ఆలయ వ్యవస్థాపకుడు సీహెచ్.నరసింహులస్వామి పాల్గొన్నారు.

తెలంగాణ ఏజెన్సీ గరుడజాతికి ఎస్సీ స్థాయి కల్పించాలి

సినీ నటుడు సుమన్



తిరుమల ఆలయం ముందు హీరో సుమన్

తిరుమల, జనవరి1(ఆంధ్రజ్యోతి): తెలంగాణాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే తమ గరుడజాతికి ఎస్సీ స్థాయి కల్పించాలని ప్రముఖ సినీనటుడు సుమన్ కోరారు. గరుడజాతి ఇబ్బందులను తొలగించాలంటే సీఎం రేవంత్‌రెడ్డి వారికి ఎస్సీ స్థాయిని కల్పించాలన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కూడా ఈ అంశంపై అసెంబ్లీలో మాట్లాడారన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ అంశంపై చర్చిస్తానన్నారు. నూతన ఏడాది సందర్భంగా సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది అందరికి బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి శ్రీవారి ఆశీస్సులుండాలన్నారు.

శబరిమలై యాత్రలో విషాదం

మార్గమధ్యంలో గుండెపోటుతో ఇసుకతాగేలివాసి మృతి



నాదమునిరెడ్డి (ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జనవరి 1: ఏర్పేడు మండలం ఇసుకతాగేలి గ్రామానికి చెందిన తిరుమణ్యం నాదమునిరెడ్డి (53) గుండెపోటుకు గురై శబరి మలైలో మృతిచెందాడు. ఇసుకతాగేలి నుంచి పదిమంది రైలులో శబరిమలైలోని అయ్యప్పస్వామి దర్శనానికి బయలు దేరారు. అక్కడ పంబ నది వద్ద స్నానం చేసేందుకు బస్సు దిగిన కాసేపటికే నాదమునిరెడ్డి గుండె పోటుతో కుప్పకూలి చనిపోయాడు. ఆయన మృతదేహాన్ని స్నేహితులు స్వగ్రామానికి తరలించారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైసీపీ నాయకులు కందాటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు నాదమునిరెడ్డి కుటుంబసభ్యులను తదితరులను పరామర్శించారు. మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

చంద్రగిరి, జనవరి 1: చంద్రగిరి మండలం కొత్తశానంబట్లలో సోమవారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తల కొమ్ములకున్న చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు యువకులు పోటీ పడ్డారు.









పులివర్తి నానికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న కిశోర్ రెడ్డి, హరిరామ్ రెడ్డి, సాయి, తిరుచానూరు టీడీపీ నాయకులు



తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డికి బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

దేశప్రజలందరికీ స్వామి ఆశీస్సులుండాలని కోరుకున్నా

తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్



తిరుమల ఆలయం ముందు తమిళిసై సౌందర్యరాజన్

తిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరికీ తిరుమల స్వామి ఆశీస్సులుండాలని కోరుకున్నట్టు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ తెలిపారు. సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రత్యేకంగా తెలంగాణ ప్రజలకు నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ మంచి ఆరోగ్యంతో, సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరికి మలయప్పస్వామి దీవెన ఉండాలని ప్రార్థించానన్నారు.



టీడీపీ నేత పులివర్తి నానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అత్తూరు తులసేశ్వరరెడ్డి

తిరుపతి

సాష్టాంగ నమస్కారంతో అంగన్వాడీల నిరసన

తిరుపతి (రవాణా), జనవరి 1: సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సోమవారం సాష్టాంగ నమస్కారంతో నిరసన తెలిపారు. వీరికి హాకర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుజ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి తంజావూరు మురళి మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 'నేను ఉన్నాను.. నేను విన్నాను' అన్న సీఎం జగన్ నేడు అంగన్వాడీల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. వారికి మూడువేల రూపాయలు జీతం పెంచినా రూ.500 కోట్లకు మించదన్నారు. ఇది ప్రభుత్వానికి పెద్దభారం కాదని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమస్య జఠిలం కాకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, అంగన్వాడీలు సుజిత, గోమతి, ఎల్లమ్మ, అరుణ, గీత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'టీటీడీ ఎంప్లాయీస్' క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి(కొర్లగుంట),జనవరి1 : టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, బ్యాంకు ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. బ్యాంకు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్లకిరణ్, కోశాధికారి ఎ.మునివెంకటరెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు హేమలత, గుణశేఖర్, గంట భరత్, సునీల్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు





మనోజ్ సిన్హా - లక్ష్మణ్‌రెడ్డి

తిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠద్వార దర్శనం చివరి రోజు, నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం ఉదయం పలువురు ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్నారు. వారిలో విశాఖ శారదపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, జమ్మూకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఏపీ లోకాయుక్త లక్ష్మణ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర మంత్రులు నాగార్జున, జయరాం, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తమిళనాడు మంత్రి గాంధీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

'టీటీడీ బీసీ ఎంప్లాయీస్' క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి(కొర్లగుంట), జనవరి 1: టీటీడీ బీసీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను టీటీడీ ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, శేషుబాబు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు జేఈవో సదాభార్గవి, ఎఫ్‌ఏఅండ్ సీఏవోలు బాలాజీ, రవిప్రసాద్, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో కస్తూరిబాయి, అదనపు సీవీఎస్వో శివకుమార్‌రెడ్డి, వీజీవో బాలిరెడ్డి, సీనియర్ అధికారులను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.రవీంద్రబాబు ప్రధాన కార్యదర్శి గంగా రాజ్ కుమార్‌యాదవ్, కామరాజు, సాయికుమార్, మునిబాలకుమార్, రామచంద్ర, శైలేంద్రకుమార్, లోకనాథం, దేశయ్య, రామారావు, సాయికుమార్, రాఘవేంద్ర బాబు, రెడ్డెప్ప, హేమకుమార్, వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేత జేబీ శ్రీనివాస్‌కు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, నాయకులు కిరణ్, రఘు, విజయ్, జగ్గా, కాలేషా, బాషా

ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలిసిన ఎస్ఎస్ ఉద్యోగులు

తిరుపతి(విద్య), జనవరి 1 : సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలసి సమస్యలు వివరించారు. ప్రతిపక్షనేత హోదాలో సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా తమను రెగ్యులరైజ్ చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. చెవిరెడ్డి కుమారుడు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డిని కూడా కలసి విన్నవించారు. స్పందించిన మోహిత్ ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే చెవిరెడ్డి ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



మంత్రి నాగార్జునకు పుష్పగుచ్ఛమిస్తున్న నేతలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 1: విజయవాడలో ఏర్పాటు చేసిన 120 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఈనెల 19న జిల్లా దళిత సంఘాల ప్రతినిధులు తరలిరావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున కోరారు. శ్రీవారి దర్శనానంతరం సోమవారం సాయంత్రం తిరుపతికి(టౌన్‌క్లబ్ కూడలి వద్ద) వచ్చిన ఆయన్ను ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ వై.ప్రవీణ్ ఆధ్వర్యంలో వివిధ దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను అన్ని గురుకుల పాఠశాలలో ప్రదర్శించడానికి అనుమతివ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.చెంగల్‌రాయులు, ఎ.గోవింద్, ఎం.ధనుంజయులు, చంద్రశేఖర్, రామకృష్ణ, కృష్ణయ్య, సహదేవయ్య పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ఉచిత టీకా సేవలు ప్రారంభం



తిరుపతి సిటీ, జనవరి 1 : స్విమ్స్‌లోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత టీకా(వ్యాధి నిరోధక) కార్యక్రమం ప్రారంభమైంది. ప్రారంభించిన స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఎదగడంతో పాటు భవిష్యత్తులో వచ్చే వ్యాధులను తట్టుకోగలుగుతారని అన్నారు. ప్రతినెలా మొదటి వారంలో ఓపీ సమయంలో ఈ ఉచిత టీకాలు వేస్తారని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషాకళావత్, రిజిస్ట్రార్ అపర్ణబిట్లా పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో కారు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడిన తమిళనాడు భక్తులు



తిరుమల, జవవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో సోమవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన భక్తులు స్వల్పగాయాలతోబయటపడ్డారు. తమిళనాడు కాంచీపురానికి చెందిన ఆనందమురుగన్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. దర్శనం ముగించుకుని సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్‌లోని 30వ మలుపు వద్ద కారు అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న క్రాష్ బారియర్‌ను ఢీకొంది. వేగం అదుపుకాకపోవడంతో రోడ్డుపక్కనున్న అడవిలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులోని నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అధికారులు విచారణ జరుపుతున్నారు. కారును టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది తొలగించారు.

స్పందనకు 44 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 1 : ఆంగ్ల సంవత్సరాది రోజున కూడా ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చారు. స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించారు. మొత్తం 44 అర్జీలు రాగా అందులో అత్యధికంగా భూ సమస్యలపైనే ఉన్నాయి. డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

మా పూర్వీకుల ఆస్తిని వేరే వారికి బదలాయించారు



అయ్యా మాది బాలాయపల్లి మండలం అలిమిలిపాళెం గ్రామం. మా గ్రామంలోని రెండు సర్వే నంబర్లలో 1.89ఎకరాలకు సంబంధిన భూమి మా తండ్రి పేరుతో ఉంది. ఆయన తదనంతరం మేము సాగు చేసుకుంటున్నాం. మూడేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో శంకర్‌రెడ్డి పేరు మీద నమోదు చేశారు. అది గమనించి మార్పు చేయాలని పలుమార్లు కోరినా మాకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఇప్పటికి నాలుగుసార్లు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. భూమిని మా పేర్లతో నమోదు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

- మహేష్, అలిమిలిపాళెం, బాలాయపల్లి మండలం

రెవెన్యూ అధికారులు అన్యాయం చేశారు



కే వీ బీ పురం మండలం రాజులకండ్రిగ గ్రామ పంచాయతీలో సర్వే 416సిలో దళిత సామాజిక వర్గానికి సంబంధించిన నాకు 4 ఎకరాల భూమికి ప్రభుత్వం 1995లో డీకేటీ పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి అది నా అనుభవంలోనే ఉంది. వర్షాధార పంటలు వేసి జీవనం సాగిస్తున్నాను. సదరు భూమిపై శ్రీకాళహస్తి డీసీబీ బ్యాంకులో లోను కూడా తీసుకున్నాను. అయితే కొందరు రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆన్‌లైన్‌లో వేరేవారి పేర్లు నమోదు చేసి, నాకు అన్యాయం చేస్తున్నారు. మీరైనా స్పందించి వెబ్‌ల్యాండ్‌లో నా పేరు నమోదు చేయండి.

- బత్తెయ్య, రాజులకండ్రిగ గ్రామం, కేవీబీపురం మండలం



కలెక్టరేట్ స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ నౌషాద్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.34 కోట్లు

తిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.34 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 64,665 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,845 మంది తలనీలాలు సమర్పించారు.

కిటకిటలాడిన ఆలయాలు



తిరుపతి (కల్చరల్), జనవరి 1 : నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని ఆలయాలు కిటకిటలాడాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకున్నారు. గోవిందరాజస్వామి, కపిలేశ్వరస్వామి, శ్రీరాములు వారు, అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న లక్ష్మీనారాయణ, వేంకటేశ్వర స్వామి, కేటీ రోడ్డులోని వరదరాజ స్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి కనిపించారు. అలాగే ఎస్వీయూలోని జ్ఞానప్రద వేంకటేశ్వరస్వామి, ఎల్ఎస్ నగర్, కొత్త వీధిలోని వేంకటేశ్వరాలయం, తుమ్మలగుంట మార్గం, మంచినీళ్లగుంట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరాలయాలు, ఇతర స్థానిక ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. కొత్త ఏడాది తొలి రోజు కావడంతో ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదవితరణ చేపట్టారు. సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అనాథలు, వికలాంగులతో కొత్త సంవత్సర వేడుకలు

- పండ్లు, మిఠాయిలు, బట్టలు పంచిపెట్టిన ఎస్పీ దంపతులు





వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి - వృద్ధులకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్పీ సతీమణి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 1 : ఎస్పీ పరమేశ్వరరెడ్డి దంపతులు సోమవారం అనాథలు, వికలాంగులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ముందుగా వారు ఖాదీ కాలనీలోని మదర్‌థెరిసా అనాథాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులు, వికలాంగులు, ఆశ్రమ నిర్వాహకులతో కలిసి కేక్ కట్‌చేసి, వేడుకలు చేసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఆశ్రమ వాసులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారికి పండ్లు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఎస్పీ దంపతులకు ఆశ్రమ నిర్వాహకులు, సిస్టర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీలు సురేంద్రరెడ్డి, భవ్యకిషోర్, అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

మాజీ ఎంపీ చింతా మోహన్



కుమారుడు, కుమార్తెతో చింతామోహన్

తిరుమల,జనవరి1 (ఆంధ్రజ్యోతి): 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. నూతన ఏడాది సందర్భంగా ఆయన తన కుమారుడు చింతా భరత్, కుమార్తె చింతా నీనాతో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ అధ్యాపకుల సంఘ క్యాలెండరు ఆవిష్కరణ



తిరుపతి(విద్య), జనవరి 1: ఏపీ ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండరును సోమవారం తిరుపతిలోని ప్రాంతీయ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డితో కలిసి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, నాయకులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుపి.రాజనాల, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పలువురు అధ్యాపకులు ఆర్ఐవోని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ముక్కంటి సేవలో కశ్మీర్ గవర్నర్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీనివాసులు

శ్రీకాళహస్తి జనవరి 1: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సోమవారం జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సింహ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సహస్రలింగం వద్ద రాహుకేతు సర్పదోష పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గవర్నర్ ముక్కంటి ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మనసు మారేవరకూ సమ్మె ఆగదు



శ్రీకాళహస్తి జనవరి 1: ప్రభుత్వం మనసు మార్చుకునే వరకు తమ సమ్మె ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ కేంద్రం వద్ద 21వ రోజు సోమవారం అంగన్వాడీలు నిరవధిక సమ్మెలో కొనసాగించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, నాయకులు గురవయ్య మణి రేవతి పుష్ప సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం: జనసేన



కోట వినుత ఇంటింటి ప్రచారం

తొట్టంబేడు, జనవరి 1: నూతన సంవత్సరంలో వైసీపీ పతనం ఖాయమని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. మండలంలోని బసవయ్య పాళెం పంచాయతీలలో 'జనసేన విజయ యాత్ర.. ఏపీ నీడ్స్ పవన్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైసీపీ అవినీతి, అక్రమాలు, అరాచకాలపై ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ -జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ప్రధానకార్యదర్శి పేట చంద్రశేఖర్, నాయకులు కావలి శివకుమార్, గణేష్, రవికుమార్‌రెడ్డి, లక్ష్మి, కవిత, నాథముని, శారద రాజ్యలక్ష్మి, దినేష్, సురేష్, రాజేష్, మునెయ్య, జనసైనికులు పాల్గొన్నారు.

సంగీత మహోత్సవాలకు తరలిరండి

శ్రీకాళహస్తి, జనవరి 1: ఈ నెల 6,7వ తేదీలలో తిరుపతిలో నిర్వహించనున్న సద్గురు త్యాగరాజ స్వామి సంగీత మహోత్సవాలకు తరలిరావాలని వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్య క్షులు రుద్రకోటి సదాశివం కోరారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద వాయిద్య కళా కారులకు ఆయన సంగీత మహోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ శాక్సో ఫోన్ కచేరి, గాత్రకచేరి, అంతర్జాతీయ ప్రఖ్యాత నాదస్వర డోలు విద్వాసులచే కచేరి జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, మునస్వామి, లోకనాథుడు, కృష్ణమూర్తి, హరికుమార్, వెంకయ్య, వెంకట నారాయణ, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలై యాత్రలో విషాదం

మార్గమధ్యంలో గుండెపోటుతో ఇసుకతాగేలివాసి మృతి



నాదమునిరెడ్డి (ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జనవరి 1: ఏర్పేడు మండలం ఇసుకతాగేలి గ్రామానికి చెందిన తిరుమణ్యం నాదమునిరెడ్డి (53) గుండెపోటుకు గురై శబరిమలైలో మృతిచెందాడు. ఇసుకతాగేలి నుంచి పదిమంది రైలులో శబరిమలైలోని అయ్యప్పస్వామి దర్శనానికి బయలు దేరారు. అక్కడ పంబ నది వద్ద స్నానం చేసేందుకు బస్సు దిగిన కాసేపటికే నాదమునిరెడ్డి గుండె పోటుతో కుప్పకూలి చనిపోయాడు. ఆయన మృతదేహాన్ని స్నేహితులు స్వగ్రామానికి తరలించారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైసీపీ నాయకులు కందాటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు నాదమునిరెడ్డి కుటుంబసభ్యులను తదితరులను పరామర్శించారు. మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



శ్రీకాళహస్తి జనవరి 1: మృతుని కుటుంబానికి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆర్థిక సహాయం అందజేశారు. రేణిగుంట గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పని చేసే పురుషోత్తం తొండమనాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. మృత దేహానికి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహిం చారు. గతంలో పురుషోత్తం శ్రీకాళహస్తి పట్టణం తెలుగు గంగ కాలనీలోని గురుకుల పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించారు. దీంతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం మార్చురీ వద్దకు చేరుకుని ఆయన కుటుంబానికి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్‌ఎల్వీ-సీ 58 ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలకు పలువురు అభినందనలు తెలియజేశారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, టీడీపీ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రా రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారంటూ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

స్వర్ణకాంతుల్లో చెంగాళమ్మ



సూళ్లూరుపేట, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణశోభతో వెలుగొందారు. తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయాన్ని రంగురంగుల పుష్పాలు, రంగువల్లులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజి, మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈవో శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చేవరకు సమ్మె ఆగదు





గూడూరులో కోలాటం, కోటలో కబడ్డీ ఆడుతున్న అంగన్వాడీలు

గూడూరు, జనవరి 1: ఎన్నికల సమయంలో సీఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు సమ్మె ఆగదని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ 21రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, ఆసియా, వజ్రమ్మ, మంగమ్మ, కోటమ్మ, శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, గోపీనాథ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మౌనంపాటిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీలు రోడ్డుమీద చేరేవిధంగా చేశారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 21కి చేరింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ నాయకురాలు హైమావతి మాట్లాడుతూ అంగన్వాడీల మూడు వారాలుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

కోట: పట్టణంలోని స్త్రీశిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. దీక్షా శిబిరం ఎదుట కబడ్డీ ఆడి, నృత్యాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వెంకటగిరి: సమస్యల సాధన కోసం బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న రిలే దీక్ష సోమవారం 21వ రోజు కొనసాగింది. అంగన్వాడీలకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు ఉదయ్‌భాస్కర్, ఆర్.కృష్ణయ్య, పెద్దయ్య, సీఐటీయూ నేతలు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, మంజుల, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు - వెంకటగిరిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, జనవరి 1: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 7వ రోజు కొసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26వేలు అందజేయాలన్నారు. అలాగే పర్మినెంట్ ఉద్యోగులకు ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకుండా మొండి వైఖరితో వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రమేష్, గోపీనాథ్, బీవీ రమణయ్య, కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, సంపూర్ణమ్మ, రాఘవయ్య, శీనయ్య, కొండయ్య, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పారిశుధ్య కార్మికులు నినాదాలు చేస్తూ ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 7 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్మికుల సమ్మెతో పట్టణంలో చెత్త నిల్వ చేరి ఆరోగ్యానికి ఇబ్బందికరంగా మారుతుందన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ముకుంద, మస్తానయ్య, అరావలి, మధు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడు చెరువులో పశువుల కాపరి గల్లంతు



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

కోట, జనవరి 1: కోట మండలం చిట్టేడు చెరువులో పశువుల కాపరి ఎం. సుబ్రహ్మణ్యం గల్లంతయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందం గాలింపు చర్యలు చేపట్టాయి. స్థానికుల కథనం మేరకు.. చిట్టేడు గ్రామానికి చెందిన నన్నెమాల సుబ్రహ్మణ్యం ఆదివారం పశువులను నీళ్ల తాగేందుకు చెరువులోకి తోలాడు. ఎంతకీ పశువులు గట్టుపైకి రాకపోవడంతో సుబ్రహ్మణ్యం చెరువులోకి దిగాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించడంతో చెరువు దగ్గర బట్టలు, చేతికర్ర, చెప్పులు కనబడ్డాయి. సోమవారం గ్రామస్తులంతా కలసి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అగ్నిమాప సిబ్బంది, రెస్క్యూ టీమ్ చెరువులో గాలింపు చేపట్టారు. చీకటిపడినా సుబ్రహ్మణ్యం జాడ దొరకలేదు.

పేదలకు అండగా ఉంటాం : ఆప్

వరదయ్యపాళెం, జనవరి 1: పేదలకు అండగా ఉండేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఆమ్ ఆద్మీ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మొరుంపల్లి నందిని అన్నారు. 'సామాన్యుడి శంఖారావం' ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఐదవ రోజు సోమవారం వరదయ్యపాళెం మండలం గోపాలరావు కాలనీలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన శ్రీనివాస్‌తో కలిసి ఆమె పర్యటించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ పేదలు నాయకులపై ఆధారపడకుండా తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా చేయడమే తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

22న ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

పిచ్చాటూరు, జనవరి 1: ఈ నెల 22న అయోధ్యలోని శ్రీరామ మందిరంలో బాల శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా అయోధ్యలోని రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే అక్షింతలు బీజేపీ అభిమాని కీళపూడికి చెందిన శేఖర్‌రాజు ఇంటికి చేరాయి. మహిళలు చిన్నచిన్న కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు. మంగళవారం నుంచి ఇంటింటా అందజేయనున్నారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

తొట్టంబేడు, జనవరి 1: మండలంలోని చిన్నసింగమాలలో వెలసిన వీరభద్రస్వామికి నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 1: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను మండల ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆది వారం రాత్రి నుంచే నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. బుచ్చినాయుడుకండ్రిగ ఈసీఐ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేశారు. తెల్లవారుజాము నుంచే బీఎన్‌కండ్రిగలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి, నీర్పాకోటలోని చెంగాళమ్మ, ఆలయం, పచ్చాలమ్మ కాలనీలోని పచ్చాలమ్మ దేవత, ఆలత్తూరులోని అంకాళమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలినరీ ఇన్‌స్టిట్యూట్ దక్షిణ భారతావనికి వరం

ప్రతిష్ఠాత్మక సంస్థను మరింతగా అభివృద్ధి చేస్తాం ● అడ్మిషన్లు మరింతగా పెంచాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ తిరులోగ చందన్‌తో కిషన్‌రెడ్డి తదితరులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 1: తిరుపతి జిల్లాలో ఏర్పాటైన అత్యంత ప్రతిష్ఠాత్మక పాకశాస్త్ర సంస్థ దక్షిణ భారతావనికి వరం లాంటిదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభివర్ణించారు. సోమవారం ఆయన తిరుమల నుంచి తిరుపతికి చేరుకుని స్థానిక నాయకులతో కలిసి కలినరీ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలించారు. ఫ్యాకల్టీతో మాట్లాడి వివరాలు రాబట్టారు. అడ్మిషన్లు తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. అన్ని కోర్సులకు అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఇక్కడ అడ్మిసన్లు జరుగుతున్నాయని, రెండేళ్లుగా అంతకంటే ఎక్కువ ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఫ్యాకల్టీ మంత్రికి వివరించారు. సిబ్బంది కొరత కూడా ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి అకడమిక్ విషయాలు, వసతులు, ఫ్యాకల్టీ సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పాకశాస్త్ర సంస్థలు ఒకటి నోయిడాలో ఉండగా మరొకటి తిరుపతిలో ఏర్పాటైందన్నారు. దక్షిణ భారత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థకు మరిన్ని నిధులు అందించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ తిరులోగ చందన్, పర్యాటక శాఖ సౌత్‌జోన్ రీజనల్ డైరెక్టర్ వెంకటేషన్ దత్తాత్రేయన్, అలిపిరి సమీపంలోని ఎస్‌ఐహెచ్‌ఎం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణప్రసాద్, సంస్థ ఫుడ్ ప్రొడక్షన్ ఫ్యాకల్టీ, చెఫ్ విష్ణుప్రియ, ఏపీ హోటల్స్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు మునిసుబ్రహ్మణ్యం, పొన్నగంటి భాస్కర్, వరప్రసాద్ మంత్రితో ఉన్నారు.

అనాధలతో ప్రేమపూర్వకంగా వ్యవహరించాలి



పోలీసులకు స్వీట్లు తినిపిస్తున్న వృద్ధులు

పుత్తూరు అర్బన్, జనవరి 1: అనాధలతో ప్రతి ఒక్కరూ ప్రేమపూర్వకంగా వ్యవహరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని కల్యాణపురం వద్ద ఉన్న మదర్ ఇండియా అనాథాశ్రమంలో పోలీసులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పుల వల్ల సమాజంలో మానవ విలువలు, కుటుంబ సంబంధాలు ప్రమాదకర పరిస్థితికి చేరుకున్నాయని అభిప్రాయపడ్డారు. వృద్ధులను అనాథాశ్రమాల్లో వదిలివెళ్లడం బాధాకరమని, వారికి సమాజంలో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని హితవుపలికారు. అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు వెంకటమోహన్, గౌరిశంకర్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి స్వీట్లు పంచిపెట్టారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ మోహన్‌కృష్ణ, టౌన్ ప్లానింగ్ విభాగం వంశీ, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సదాశివేశ్వరుడికి వెండి అభరణాల వితరణ



వెండి ఆభరణాలను అందిస్తున్న దాతలు

వడమాలపేట, జనవరి 1: మండల పరిధిలోని సదాశివకోనలో వెలసిన సదాశివేశ్వర స్వామికి చెన్నైకు చెందిన భక్తులు వెండి ఆభరణాలు వితరణగా అందజేశారు. చెన్నై పూందమల్లికి చెందిన ఎస్.బాలమురుగన్, ఎస్.శారద, సెంథిల్ మురగన్ ఆదివారం వెండి నాగపడగ, కిరీటంను ఆలయ ఛైర్మన్ జయచంద్రన్‌కు అందజేశారు. ఉదయం సదాశివుడి మహాలింగానికి అభిషేకం నిర్వహించి, కిరీటం, నాగపడగలను అలంకరించారు. దాతలను ఛైర్మన్ జయచంద్రన్ సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు వార్తలు

కైలాసనాథ కోనలో భక్తుల సందడి



కైలాసనాథ కోన జలపాతం వద్ద భక్తులు

నారాయణవనం, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా మండల కేంద్రంలోని పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామి వారికి నిత్య కైంకర్యాలు చేపట్టి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే మండల పరిధిలోని కైలాసనాథ కోనలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం కామాక్షీదేవి సమేత సదాశివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. భక్తులు జలపాతంలో స్నానమాచరించి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

అప్పలాయగుంటకు పోటెత్తిన భక్తజనం

వడమాలపేట, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వడమాలపేట, తిరుపతి, పుత్తూరు పరిసరాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుని మొక్కులు తీర్చుకున్నారు. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతాప్‌స్వామి అన్నదానం చేశారు.

అపరిశుభ్రతపై సీఈవో ఆగ్రహం

వడమాలపేట, జనవరి 1: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంపై ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ సీఈవో ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆయన ఆవరణలో అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించారు. ఎంపీడీవో భానుమూర్తి అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణే ఇలాఉంటే మండలంలో అభివృద్ధి ఎలా ఉంటుందోనని సీఈవో అసహనం వ్యక్తం చేశారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలకు మంచిరోజులు



అంగన్వాడీలకు ఆర్థిక సాయం అందిస్తున్న పోతుగుంట విజయబాబు

పుత్తూరు అర్బన్, జనవరి 1: టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక అంగన్వాడీలకు మంచిరోజులు వస్తాయని ఆ పార్టీ నాయకుడు పోతుగుంట విజయబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించి యూనియన్‌కు రూ.20 వేలు తనవంతుగా ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో జగన్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి వర్గం రోడ్డుపైకి రావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నూతన సంవత్సరం ప్రారంభవేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన సమయంలో అంగన్వాడీలు దీక్ష చేస్తుండడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల న్యాయబద్ధమైన కోర్కెలను చంద్రబాబునాయుడు ప్రభుత్వం నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, కోఆపరేటివ్ సూపర్‌బజార్ ఛైర్మన్ చంద్రాయాదవ్, వైస్ ఛైర్మన్ రమేష్‌బాబు, అప్పయ్యనాయుడు, మణి, నరేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అంగన్వాడీల సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరింది. అంగన్వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ నూతన ఏడాదిలోనైనా సీఎం జగన్ అంగన్వాడీల సమస్యల పట్ల సానుకూల నిర్ణయం ప్రకటించాలన్నారు. ఈనెల 3న కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. అన్ని సంఘాలను కలుపుకుని అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

నవరత్నాలతో మోసం చేసిన జగన్‌కు బుద్ధి చెబుదాం: టీడీపీ



భవానీ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 1: నవరత్న పథకాలను ఆశగా చూపి ఓట్లు దండుకుని, ఆ తరువాత నిబంధనల పేరుతో అర్హులను తొలగించిన సీఎం జగన్‌కు, వైసీపీకి రానున్న ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ పరిధిలోని భవానీనగర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలన మొత్తం కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేత్తో లాగేసుకోవడమేనని తేల్చిచెప్పారు. పన్నులు, ధరల పెంపుతో సామాన్యుల నడ్డివిరచడం, అందినకాడికి అప్పులు చేయడం, అందులో పదోవంతు బటన్ నొక్కడం తప్ప సమాజానికి, కుటుంబాలకు ఒరిగిందేమీలేదన్నారు. సాక్షి పేపర్‌కు ప్రకటనల పేరుతో రూ.వందల కోట్లు దోచిపెడుతున్న జగన్ అంగన్వాడీలకు వేతనాలను పెంచేందుకు మనసురావడం లేదన్నారు. మహానాడులో చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తిని ఆర్థికంగా, సామాజికంగా స్వశక్తితో ఎదిగేందుకు దోహదం చేసే పథకాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఆరు గ్యారెంటీలను కరపత్రాల ద్వారా వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీఆర్ యుగంధర్, 4వ వార్డు కౌన్సిలర్ కేశవాచ్చారి, మాజీ కౌన్సిలర్ గోపీఆచ్చారి, నాయకులు ఎల్లంటి ప్రసాద్ నాయుడు, ఐటీసీ రఫీ, భాస్కర్‌నాయుడు, ఈశ్వర్‌యాదవ్, బూత్ ఇన్‌చార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ముక్కంటి ప్రసాదాలు



ఏర్పేడు, జనవరి 1: టీడీపీ అధినేత చంద్ర బాబును సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి వారి గురవారెడ్డి హైద రాబాద్‌లోని ఆయన స్వగృ హంలో కలిసి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. ఈ సంద ర్భంగా 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ', తంబళ్లపల్లె నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు ఆరా తీశారు.

మహిళలకు చీరల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి1: మండలంలోని తహనగర్ గ్రామం లోని వడ్డెర మహిళలకు మండల వడ్డెర సంఘం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు యన మల ప్రసాద్ చీరలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, గోపి, మున స్వామి, మునిశేఖర్, సత్యయ్య, ముత్యాలయ్య పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో దుప్పట్ల పంపిణీ



సత్యవేడు/ వరదయ్య పాళెం, జనవరి 1: సత్య వేడు మండలం మదనం బేడులోని అనాథాశ్రమంలో ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరిం చుకుని సీఐ శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలికలకు సుమారు వంద దుప్పట్లు పంపిణీ చేశారు. వరదయ్యపాళెం ఎస్ఐ నాగార్జునరెడ్డి, నాగలాపురం ఎస్ఐ ఓబయ్య, సత్యవేడు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అమృత్ భారత్ రైలుకు స్వాగతం

రేణిగుంట, జనవరి1: పశ్చిమ బెంగాల్‌లోని మాల్డాటౌన్‌లో శనివారం ప్రధాని మోదీ ప్రారం భించిన అమృత్ భారత్ రైలుకు రేణిగుంట రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్యరైల్వే అధికారులు అభిరామ్, కుప్పాల సత్యనారాయణ, బీజేపీ నాయకులు చంద్రప్ప స్వాగతం పలికారు. మధ్యాహ్నం1.44గంటలకు రేణిగుంటకు చేరుకుంది.1.55 గంటలకు బెంగళూరు వెళ్లడానికి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అధికారులు హరికృష్ణారెడ్డి, శేషగిరినాథరెడ్డి, టీసీవీ రాజు, ఐపీఎఫ్‌లు మధుసూదనరావు, సందీప్‌కుమార్, కె.సుధాకర్, ఎస్‌వీ.రావ్, డీఆర్‌యూసీసీ సభ్యులు భరత్‌రెడ్డి, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి జనవరి 1: శ్రీకాళహస్తిలో 3వ తేదీ నుంచి జరగనున్న మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య సోమవారం ప్రకటనలో పిలుపు నిచ్చారు.

భక్తజన సంద్రం ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి జనవరి 1: ముక్కంటి ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వరుస సెలవులు, ఆంగ్ల నూతన సంవత్సరం, శివయ్యకు ప్రీతికరమైన సోమవారం రోజు కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సోమవారం వేకువజాము నుంచే క్యూలైన్లో భక్తులు బారులు తీరారు. ఉదయం రాహుకాలం సమయంలో రాహు కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకు నేందుకు అత్యధికంగా ఆసక్తి చూపారు. భక్తుల రద్దీ పెరగడంతో సన్నిధి వీధిలో వాహనాల తాకిడి అదే స్థాయిలో కనిపించింది. దీంతో పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

శివ శివా..!

ముక్కంటి ఆలయ స్థలంలో అక్రమార్కుల పాగా

శ్రీకాళహస్తి జనవరి 1: కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా శ్రీకాళహస్తిలో అక్రమార్కులు విజృంభిస్తూనే ఉన్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తున్నారు. ఎన్నికలు సమీ పిస్తున్న కొద్దీ అక్రమంలో అంతకంతకు జోరు అందుకుంటున్నాయి. ఏరోజు ఎక్కడ కబ్జా వెలుగు చూస్తుందో అర్థం కాని పరిస్థితి నెల కొంది. తాజాగా శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున బాబు అగ్రహారం ప్రాంతంలోని ముక్కంటి ఆలయ భూమిపై కన్నేశారు. రాత్రికి రాత్రి ఆస్థలానికి కంచెను తొలగించడమే కాకుండా దర్జాగా గ్రావెల్ తోలి షెడ్డు నిర్మాణానికి ఇనుప పోల్స్ నాటేశారు. దీనిపై దుమారం రేగడంతో ముక్కంటి ఆలయ అధికారులు ఆక్రమణలు తొలగించారు. శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున బాబు అగ్రహారం ప్రాంతం ఉంది. మొత్తం పట్టణానికే ఈ ప్రాంతం కేంద్ర బిందువు. ఇక్కడే ప్రధాన రహదారికి ఆనుకొని ఉత్తరం వైపున ముక్కంటి ఆలయ నారద పుష్కరిణి ఉంది. అలాగే రహదారికి దక్షిణం వైపున సుమారు 200 గజాల ముక్కంటి ఆలయ స్థలం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఇనుపకంచెను హద్దుగా నిర్మించారు. దీని విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుంది. ప్రధాన రహదారికి ఆనుకొని తూర్పు, ఉత్తరం కార్నర్ ప్లాట్ కావడంతో కొందరు దీనిపై కన్నేశారు. అధికార పార్టీ నాయకుల బొమ్మలతో స్టిక్కర్లు అతికించిన ఓ బంకును పది రోజుల క్రితం ఈ స్థలం వద్ద పెట్టేందుకు కొందరు ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకోవడంతో బంకును వేరే చోటికి తరలించారు. అయితే రెండు రోజుల క్రితం ఏకంగా కంచెను తొలగించి రాత్రి వేళలో స్థలంలో గ్రావెల్ తోలించారు. ఆ తర్వాత షెడ్డు నిర్మించేందుకు పనులు చేపట్టారు. ముక్కంటి ఆలయ అధికారులు స్పందించి సోమ వారం ఆక్రమణలను అడ్డుకున్నారు. ఆలయ స్థలం పైన అక్రమార్కులు కన్నేయడంతో... ఇది చూసిన వారంతా శివ శివా ఇందేం చోద్యం అంటూ విస్తుపోయారు.



అక్రమణాల తొలగిస్తున్న ఆలయ అధికారులు

ఇందిరానగర్ పంచాయతీలో
రూ.30 లక్షల నిధులకు లెక్కలు లేవు

- ఆర్టీఐ ద్వారా వెలుగులోకి
- నిజాలు నిగ్గుతేల్చాలంటున్న జనం

వరదయ్యపాళెం, జనవరి 1: వరదయ్య పాళం మండలం ఇందిరా నగర్ పంచాయ తీలో 2016 నుంచి 2023 వరకు జరిగిన వార్షిక లావాదేవీల్లో అవకతవకలు జరిగి నట్లు ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. సాధారణ, 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.30,96,383ను రికార్డుల్లో చూపలేదు. 2016-2023 వరకు జరిగిన వార్షిక లావా దేవీలకు సంబంధించి ఇటీవల ఆడిపూడి ఆషా, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధి గుత్తి త్యాగరాజు తిరుపతి కలెక్టర్ వెంకట్ర మణారెడ్డిని వేర్వేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణను ప్రత్యేక అధికారిగా నియమించారు. అక్టో బరులో ఆయన విచారణ జరిపారు. ఆ నివే దికను కలెక్టర్‌కు అందజేశారు. అయితే ఆ రికార్డులు ఇవ్వకపోవడంతో ఆర్టీఐ ద్వారా ఆడిపూడి ఆషా వాటిని పొందింది.

ఆ రికార్డుల వివరాలు ఇలా ఉన్నాయి..

పంచాయతీకి సాధారణ నిధుల్లో భాగంగా రూ.18,19,807 డ్రాచేయగా రూ.11,77,345 రికార్డుల్లో చూపారు. నిల్వగా రూ.9,553 ఉండడగా రికార్డులో చూపని మొత్తం రూ.6,32,909. అదేవిధంగా 14వ ఆర్థిక సంఘం నిధుల కింద వివిధ పనుల కోసం రూ.49,22,598 డ్రా చేయగా రూ.28,15,563 రికార్డుల్లో చూపారు. నిల్వ మొత్తంగా రూ.11,688 ఉంది. రికార్డులో చూపని మొత్తం రూ.20,95,347లుగా ఉంది. ఇక 15వ ఆర్థిక సంఘం నిధుల కింద వివిధ పనుల కోసం రూ.4,99,052 డ్రాచేయగా రూ.1,30,925 రికార్డుల్లో చూపారు. మిగిలిన రూ.3,68,127లు చూపలేదు. మొత్తంగా రూ.30,96,383 రికార్డుల్లో చూపకపోవడంతో అవకతవకలు జరిగాయని పంచాయతీ ప్రజలు భావిస్తున్నారు. అదేమిటో తేల్చాలని కోరుతున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

శ్రీకాళహస్తి జనవరి 1: శ్రీకాళహస్తికి చెందిన వైసీపీ నాయకులు విజయ్‌కుమార్ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి జన్మదినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ ముక్కంటి ఆలయం వద్ద పలువురు వృద్ధులకు దుప్పట్లు, ఆహారం అందించారు.

టీడీపీ బలోపేతానికి అందరూ కృషిచేయాలి



రామాంజులనాయుడు, గోపీనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, జనవరి 1: టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు విభాగం అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ఇప్పటినుంచే గ్రామాల్లో పర్యటించి పార్టీ బలో పేతానికి కృషిచేయాలని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న అరాచకపాలనను గడపగడపలో తెలియజేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ టీడీపీకి ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలు రామాంజుల నాయుడు, గోపీనాథ్‌రెడ్డిని ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి రామచంద్రయ్య, చంద్రయ్యనాయుడు, సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ కాలువలో మృతదేహం లభ్యం



మణి (ఫైల్‌ఫొటో)

పిచ్చాటూరు, జనవరి 1: అరణి యార్ రిజర్వాయర్ ఎడమ కాలువలో రెప్పాల పట్టు సమీపంలో నాగలాపురానికి చెందిన ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాలువలో సోమవారం ఉదయం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తిం చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతుడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డు ఆధారంగా నాగలా పురం మండలంలోని రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటయ్య కుమారుడు మణిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతడు కాలుజారి కాలువలో పడి చనిపోయి ఉండవచ్చని ఎలాంటి అను మానాలూ లేవని వారు తెలియ జేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారయత్నం

- ప్రతిఘటించడంతో దాడిచేసి పరార్

శ్రీకాళహస్తి జనవరి 1: అత్త వరసయ్యే మహిళపై ఓ యువకుడు అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కట్టెల పొయ్యి ఊదే ఇనుప పైపుతో తలపై దాడి చేసి గాయపరిచి పరారయ్యాడు. బాధితురాలి కథనం మేరకు... శ్రీకాళహస్తి మండ లానికి చెందిన ఓ మహిళ భర్త మరణించడంతో ఒంటరిగా ఉంటోంది. కూలి పనులతో జీవనం సాగిస్తోంది. పక్క గ్రామానికి చెందిన రవి అనే యువకుడు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. సోమవారం బంధువుల ఇంటికి వచ్చి ఒంటరిగా వున్న ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించి కేకలు పెట్టడంతో రవి పక్కనే అందుబాటులో ఉన్న ఇనుప పైపు తీసుకుని ఆమె తలపై కొట్టి పరార య్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు వెల్లడించింది. అయితే దీనిపై కేసు నమోదు కాలేదు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తాం: టీడీపీ



సత్యవేడులో మద్దతు పలుకుతున్న హెలెన్, ఆర్థికసాయం అందిస్తున్న జేడీఆర్, పిచ్చాటూరులో సమ్మె నిర్వహణ

సత్యవేడు, జనవరి 1: సత్యవేడులో అంగ న్వాడీల సమ్మెకు సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి డా.హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత మద్దతు పలికారు. సోమవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శిబిరం వద్దకు చేరుకుని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ టీడీపీ అధి కారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలు పరిష్క రించే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్, నాయకులు పరమశివం, గోవింద్ చౌదరి, సంతోష్‌కుమార్, శశినాయుడు, చంద్రమోహన్, మల్లినాయుడు, దయానిధి, షణ్ముగం, మధుయాదవ్, డేవిడ్, గుణ, శరవణ, నాగరాజు, ధన, తిరుపతి పాల్గొన్నారు.

● జేడీఆర్ ఆర్థిక సాయం

అంగన్వాడీల సమ్మెకు టీడీపీ నేత జేడీ రాజశేఖర్ సంఘీభావం ప్రకటించి ఆర్థికసాయం అందించారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులోనూ అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ఎమ్మెల్యేలు, మంత్రిలు సీఎం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలు పరిష్క రించాలని కోరారు. అనంతరం కోలాటాలు, గొబ్బెమ్మ పేరడి పాటలు పాడి నిరసన తెలియజేశారు.

ఇష్టారాజ్యంగా ఆలయాన్ని కూల్చేస్తారా...?

శ్రీకాళహస్తి జనవరి 1: ఇష్టారాజ్యంగా ఆలయాన్ని కూల్చి వేస్తారా... అంటూ టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముక్కంటి ఆలయంలోని మృత్యుంజయ స్వామి సన్నిధి పక్కన ఉన్న మండపాన్ని సోమవారం అధికారులు కూల్చివేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని దర్శనానికి వెళ్లిన సుధీర్‌రెడ్డి దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో కూల్చివేసిన ప్రదేశం నుంచి వీడియో విడుదల చేశారు. ఆగమ నియమాలను పట్టిం చుకోకుండా వైసీపీ నాయకులు, అధికారులు ఇంతటి పురాతన ఆలయంలోని భాగాన్ని ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. వెంటనే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.

దొంగలించిన సామాను కొనలేదని దాడి



గాయపడిన నాగరాజు, గోపాల్

శ్రీకాళహస్తి జనవరి 1: దొంగలించిన ఇనుప సామాన్లు కొనలేదని వ్యాపారితో పాటు అతడి సహాయకుడిపై దాడిచేశారు. బాధితుల కథనం మేరకు.. శ్రీకాళహస్తికి చెందిన నాగరాజు ఏపీ సీడ్స్ కూడలి సమీపంలోని పానగల్ రోడ్డులో స్క్రాప్ దుకాణం నిర్వహిస్తుం టాడు. ఓ యువకుడు కొందడితో కలిసి ఆటోలో కొన్ని ఇనుప సామాన్లను అమ్మేందుకు అక్కడికి వచ్చాడు. అవి రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన ఇనుప సామాన్లుగా గుర్తించిన వ్యాపారి నాగరాజు వాటిని కొనుగోలు చేసేందుకు నిరాకరించాడు. ఇంతలో పోలీసులు ఇనుప సామాన్లు దొంగలించారంటూ అక్కడికి చేరుకున్నారు. దీంతో ఆటోలో వచ్చిన యువకులు అక్కడ నుంచి పరారయ్యారు. కాసేపటి తర్వాత ఆ యువకులు మళ్లీ వచ్చారు. పోలీసులకు సమాచారం ఇస్తావా అంటూ నాగరాజుతో పాటు అయన పనిచేసే గోపాల్ పై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



శ్రీకాళహస్తి జనవరి 1: పలువురు ప్రముఖులు సోమవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినీ హీరో సుమన్ వేరువేరుగా ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

